స్టాంపుల కొరతతో రిజిస్ట్రేషన్లకు ఆటంకం

- రూ.50, రూ.100 స్టాంపుల కొరత
- ప్రత్యామ్నాయంగా రూ.10, రూ.20 స్టాంపుల వినియోగం

అమలాపురం టౌన్: రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.50, రూ.100 నాన్ జ్యూడిషియల్(ఎన్‌జే) స్టాంపుల కొరత ఎక్కువగా ఉంది. జిల్లాలోని 15 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొరత కనిపిస్తున్నా రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగే రిజిస్టర్ ఆఫీసుల్లో ఈ సమస్య మరీ జటిలంగా ఉంది. స్టాంపు నిల్వలు నిండుకోవడంతో ఇతర కార్యాలయాల వద్ద ఉన్నాయానేమోనని ఆరా తీస్తున్నారు. ఉదాహరణకు జిల్లా కేంద్రం అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమస్య ఎక్కువగా ఉంది. అల్లవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల తాకిడి కొంచెం తక్కువగా ఉండడంతో అమలాపురం కార్యాలయ అధికారులు అక్కడి నుంచి రూ.100 స్టాంపులు తెప్పించుకున్నారు. ముమ్మిడివరం రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా స్టాంపుల కొరత నెలకొంది.

నాసిక్ నుంచి సరఫరా అంతంతే

దేశానికి అవసరమైన ఎన్‌జే స్టాంపులు మహారాష్ట్ర రాష్ట్రం నాసిక్‌లోనే ముద్రితమవుతాయి. ఆ ఉత్పత్తి కేంద్రం నుంచే సరఫరా అంతంత మాత్రంగా ఉండడంతో కొరత అనివార్యమవుతోందని పలు రిజిస్ట్రేషన్ల కార్యాలయాల అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు ఈ–స్టాంపింగ్ మిషన్ అమలాపురంలో కొన్ని నెలల నుంచి పని చేయకపోవడంతో మాన్యువల్ స్టాంపుల వినియోగం మరింత పెరిగింది.


అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రూ.50, రూ.100 స్టాంపులదే హవా

సాధారణంగా రూ.10, రూ.20, రూ.50, రూ.100 డినామినేషన్లలోనే స్టాంపులు ముద్రితమవుతాయి. ఒప్పంద పత్రాలు (అగ్రిమెంట్లు), బ్యాంక్ అఫిడవిట్లు, రాజీ పత్రాలు వంటి విషయాల్లో స్టాంపులు ఎక్కువగా వినియోగిస్తారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి స్టాంపుల విలువను నిర్ధారించి ఆ దిశగా స్టాంపు పేపర్లు సిద్ధం చేస్తారు. ఆస్తుల క్రయవిక్రయాలకు రూ.100 డినామినేషన్ స్టాంపును ఎక్కువగా ఉపయోగిస్తారు. రిజిస్ట్రేషన్ ఆఫీసు కంట్రోల్‌లో స్టాంపులు ఉంటాయి. అలాగే ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ఉండే స్టాంపు వెండర్లు వీటిని అమ్ముతుంటారు. ప్రస్తుతం స్టాంపు వెండర్ల వద్ద కూడా స్టాంపుల స్టాకు అయిపోయాయి. అమలాపురం రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న 14 మంది స్టాంపు వెండర్ల వద్ద రూ.50, రూ.100 డినామినేషన్ల స్టాంపులు లేకపోవడంతో క్రయ విక్రయదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసరమైతే ఇతర రిజిస్ట్రార్ కార్యాలయాల బయట బ్లాక్‌లో కొనుగోలు చేసి తెచ్చుకుని పని పూర్తి చేయించుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ల తాకిడి ఎక్కువగా ఉండే అమలాపురం కార్యాలయంలోనే రోజుకు రూ.100 స్టాంపుల 100 నుంచి 125 వరకూ అవసరమవుతాయి.



రూ.100 స్టాంపు

> **స్టాంపుల కొరత ఉంది**
> రూ.50, రూ.100 స్టాంపుల కొరత ఉంది. ఇటీవల అల్లవరం రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అమలాపురం కార్యాలయానికి రప్పించుకున్నాం. నాసిక్ నుంచే సరఫరా అంతగా ఉండడంతోనే కొరత తీవ్రమైంది. అయినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాటిని ఇతర ప్రాంతాల నుంచి రప్పించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తున్నాం.
> – ఎం.రత్నకుమార్, రిజిస్ట్రార్, అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

క్లుప్తంగా

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన


ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రకుమార్

అల్లవరం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రాణాపాయం నుంచి మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి అనే దానిపై ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓడలరేవులోని తుఫాన్ పునరావాస కేంద్రంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. తుఫాన్లు, వరదలు, భూకంపాలు వచ్చినప్పుడు మనల్ని మనం కాపాడుకుంటూ ప్రమాదంలో ఉన్నవారిని కాపాడాలని సూచించారు. అనంతరం ప్రకృతి వైపరీత్యాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మల్లాడి ఉమా మహేశ్వరరావు, ఆర్‌ఐ దుర్గా శ్రీనివాస్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనులకు శంకుస్థాపన


విలసవిల్లిలో అమృత్ సరోవర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి, గొల్లవిల్లి గ్రామాల్లో అమృత్ సరోవర్ పనులకు సర్పంచ్‌లు సోమవారం శంకుస్థాపన చేశారు. విలసవిల్లి గ్రామంలో గానుగ చెరువుకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి, గొల్లవిల్లి యల్లారమ్మ చెరువుకు సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో చేస్తున్న ఈ పనుల్లో పరిసర గ్రామాల కూలీలకు సైతం పనిదినాలు కల్పించాలని ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, జొన్నాడ చిన్ని, కోలా ఏసు, బళ్ల నాగసతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాడ్మింటన్ టోర్నీ విజేత యానాం జట్టు


విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న నిర్వాహకులు

యానాం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన కిరణ్ మెమోరియల్ బాడ్మింటన్ టోర్నీలో యానాం జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 23న రాత్రి ఎస్‌ఆర్‌ఎంటీ ఆఫీసర్స్ క్లబ్ స్టేడియంలో నిర్వహించిన డబుల్స్ ఫైనల్స్‌లో బెస్ట్ ఆఫ్ త్రీలో ఎస్‌ఆర్‌ఎంటీ ఆఫీసర్స్ క్లబ్‌పై యానాం జట్టు విజయం సాధించిందని సోమవారం నిర్వాహకులు తెలిపారు. యానాం క్రీడాకారులు పట్నా రామకృష్ణ, దునే మురళికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ద్వారంపూడి వీరభద్రారెడ్డి, హరీష్‌లకు ట్రోఫీను అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన తుని పట్టణానికి చెందిన క్రీడాకారులు జగన్, రామకృష్ణలకు సైతం బహుమతులు అందజేశారు.

ప్రచార భేరి ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో సీపీఎం, సీపీఐ పార్టీల జిల్లా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరిని సోమవారం సాయంత్రం ఆ పార్టీల జిల్లా నాయకులు ప్రారంభించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగే ఈ ప్రచార భేరి కార్యసాధనలో ప్రజలు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ప్రచార భేరి వాహనాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నాగ వరలక్ష్మి, పీతల రామచంద్రయ్య, అడపా సత్యనారాయణ, నిమ్మకాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యాలయంలో సమావేశం వాయిదా

ఉప్పలగుప్తం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల కార్యాలయంలో ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి నిర్వహించిన గ్రామ సభను సర్పంచ్‌లు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవటంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు మాట్లాడుతూ అధికారులు ప్రొటోకాల్ విషయంలో క్రమం తప్పుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లకు పూర్తి సమాచారం అందించి మళ్లీ సమావేశాన్ని నిర్వహిస్తామని ఎంపీడీవో సభను ముగించారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు


కొమరగిరిపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న పినిపే శ్రీకాంత్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. కొమరగిరిపట్నం–2 సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా కలిగిన లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. మూడున్నరేళ్ల కాలంలో 95 శాతం హామీలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, సొసైటీ చైర్మన్ అల్లూరి సురేష్‌రాజు, కుడుపూడి శ్రీను, మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే పేదలకు మేలు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే పేదలకు మేలు జరుగుతుందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, పార్టీ నాయకులు ఎన్ఎస్ కుమార్, కిరణ్, పాలమూరి బాబులు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం


రోళ్లపాలెంలో బైపాస్‌రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా


భీమనపల్లిలో వర్షానికి నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న ఆర్డీవో వసంతరాయుడు

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులకు అండగా నిలబడతామని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సోమవారం ఆయన అమలాపురం మండల పరిధిలోని రోళ్ళపాలెంలో పర్యటించి వర్షానికి నీటమునిగిన పొలాలు, తడిసిన ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అవసరమైన బరకాలు సరఫరా చేస్తున్నామన్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించేందుకు అవసరమైన గోనె సంచులు, హమాలీలు, రవాణా సదుపాయాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పొలాల్లో తడిసిన పనలను తిరగేసి ఉప్పు ద్రావణం పిచికారీ చేసి మొలకలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇప్పటికే మండల స్థాయి సిబ్బంది పంట క్షేత్రాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలు ముమ్మరం చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, కడలి ధర్మప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను వినియోగించుకోవాలి

ఉప్పలగుప్తం: రబీ వరి కోతల నేపథ్యంలో అకాల వర్షాలకు చేలల్లో ఉన్న వరి పనలను గట్టుకు చేర్చుకోవటానికి రైతులు అవసరమైతే ఉపాధి కూలీలను వినియోగించుకోవాలని ఆర్డీవో వసంతరాయుడు అన్నారు. మండలంలోని భీమనపల్లి గ్రామంలో ఆకస్మిక వర్షం బారిన పడి నీట మునిగిన వరి పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకం అధికారులతో మాట్లాడి పంటను సంరక్షించే చర్యలు తీసుకునేలా సహకరిస్తానని చెప్పారు. ప్రస్తుత వాతావరణ మార్పుల రీత్యా కోతలు జరపకుండా వేచి ఉండాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ పోటీల విజేతకు సత్కారం

యానాం: జాతీయ సైన్స్ పోటీల్లో విజేతగా నిలిచిన యానాం పబ్లిక్ స్కూల్ విద్యార్థిని షేక్ హుస్సేనియాను విశ్రాంత ఎల్‌ఐసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చెక్కా తాతారావు సత్కరించి బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీల్లో హుస్సేనియా ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుడాల బాలాజీ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


షేక్ హుస్సేనియాను సత్కరిస్తున్న తాతారావు

మండుటెండల వేళ ఆహ్లాద ఉషోదయం



ఉప్పలగుప్తం: మండు టెండలతో జనం అల్లాడుతున్న వేళ కోనసీమ పచ్చని కొబ్బరి చెట్ల నడుమ, లేత పసుపు రంగుతో కళకళలాడుతున్న వరి పొలాల మీదుగా సింధూర వర్ణంతో ఉదయిస్తున్న భానుడి రూపమిది. ఈ దృశ్యం స్థానికుల్ని అలరించింది. కోనసీమ అందాలను తలపించేలా ఆహ్లాదకరంగా ఉన్న ఈ చిత్రం సోమవారం 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

మున్సిపాలిటీ గోడ కూల్చివేతపై ఫిర్యాదు

యానాం: లక్షలాది రూపాయిల ప్రజాధనంతో నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేయడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎల్జీ తమిళిసై సౌందరాజన్‌కు స్థానిక నాయకులు పెనుల వెంకటేష్, హరిప్రసాద్ తదితరులు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక నల్లచెరువు ప్రాంతం నుంచి భీమనగర్ వెళ్లే రహదారిలో పాత స్టాబోర్డు అట్టల ఫ్యాక్టరీ వద్ద గతంలో ప్రజాసౌకర్యార్థం సుమారు రూ.30 లక్షలతో ప్రహరీ గోడ నిర్మించారు. అయితే కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తమ లేఅవుట్‌కు అడ్డుగా ఉందని గోడను కూల్చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికలు

రాజోలు: ఏపీ సీఎం కప్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు తాటిపాకలోని టీసీఎస్‌ఎం క్లబ్‌లో సోమవారం ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, రాజమహేంద్రవరం, రావులపాలెం, అమలాపురం, తుని, రాజోలు తదితర ప్రాంతాల నుంచి సుమారు 70 మంది బాక్సింగ్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల విభాగంలో సీహెచ్‌డీ మనోహర్, సీహెచ్ అఖిల్‌కుమార్, సీహెచ్ పృథ్వీరాజ్, జె.సందీప్, పి.దుర్గారావు, కె.కిషోర్, షేక్ షామూద్దీన్, యు.లోవరాజు, పి.వి.వి.ఎస్.డి.మహేష్, ఆర్.మధు, వి.ఎస్.శివకిరణ్, మహిళా విభాగంలో వై.దివ్యరాణి, కె.రాజీ, టి.నాగలక్ష్మి, కె.రాణి, జి.దుర్గా వీరలక్ష్మి, ఎస్.కె.నస్రీన్, జి.వెంకటలక్ష్మి, ఆర్.సంధ్య ఎంపికయ్యారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖర్, బి.మధుకుమార్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



పేరూరు సర్పంచ్ అరుణకు మెమెంటో అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా


ముమ్మిడివరంలో ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌కు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


కొమరగిరి సర్పంచ్, కార్యదర్శులకు అవార్డు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు


తాళ్లరేవు సర్పంచ్ రెడ్డి అరుణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

అమలాపురం రూరల్: స్నేహపూర్వక ఉత్తమ పంచాయతీగా పేరూరుకు అవార్డు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. సోమవారం పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ పంచాయతీగా పేరూరు సర్పంచ్ దాసరి అరుణ, కార్యదర్శి రుద్రరాజు సూరపరాజులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అవార్డు అందుకున్న సర్పంచ్ అరుణను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ శ్రీహరిరామ్‌గోపాల్, ఎంపీడీవో కాశీ విజయప్రసాద్ తదితరులు అభినందించారు.

ముమ్మిడివరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల స్థాయిలో 9 విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గ్రామ పంచాయతీలకు ఎంపీపీ కోలా గంగా భవానీ చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. పలు పంచాయతీల్లో క్లాత్ మిత్రలను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలాబాబ్జీ, ఎంపీడీఓ ఏఎస్ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ కె.పద్మజ్యోతి, వైఎస్ ఎంపీపీ పాము నాగవేణి, ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీడీఓ ఏఎల్ రెడ్డిలు అవార్డులు అందజేశారు. మెరుగైన జీవనోపాధుల కేటగిరిలో మొదటి స్థానం కొమరగిరి, ద్వితీయ స్థానం మురమళ్ల, ఆరోగ్యకరమైన గ్రామం కేటగిరిలో కొమరగిరి ప్రథమ స్థానం, పిల్లల స్నేహపూర్వక గ్రామం కేటగిరిలో ఎదుర్లంక మొదటి స్థానం, నీటి సమృద్ధి కలిగిన గ్రామం కేటగిరిలో ఐ.పోలవరం ప్రథమ స్థానం, హరిత గ్రామం కేటగిరిలో జి.మూలపాలెం ప్రథమ స్థానం సాధించాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు.

అమలాపురం రూరల్: కామనగరువు పంచాయతీలో మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి అధ్యక్షతన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు.

తాళ్లరేవు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని సమావేశపు హాలులో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన తాళ్లరేవు, పాలేకుర్రు, ఇంజరం, కోరంగి, ఉప్పంగల, గాడిమొగ, జి.వేమవరం, పి.మల్లవరం, జార్జీపేట, చొల్లంగి, పటవల, చొల్లంగిపేట సర్పంచ్‌లను ఎంపీపీ రాయుడు సునీత దుశ్శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే పొన్నాడ


ఎస్పీ శ్రీధర్‌ను కలిసి పూలకుండీ అందజేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సుసారపు శ్రీధర్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే పొన్నాడ ఎస్పీ శ్రీధర్‌కు పూల కుండీ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇద్దరూ కోనసీమ శాంతి భద్రతలపై కొద్దిసేపు మాట్లాడుకున్నారు.

26న కార్యవర్గం ప్రమాణ స్వీకారం

యానాం: ది ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు చార్టర్ ప్రెసిడెంట్ పులవర్తి వెంకరమణమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జీవీఎస్ పార్వతీశ్వరమ్మ మినీ గార్డెన్స్‌లో జరిగే ఈ సమావేశానికి డిస్ట్రిక్ట్ గవర్నర్ మార్టూరి మంగతాయారు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డీవీఎస్ రాజు తదితరులు హాజరవుతారన్నారు.

కల్యాణోత్సవాలకు పందిరి రాట ముహూర్తం


కల్యాణోత్సవాలకు పందిరి రాట ముహూర్తం చేస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు

తాళ్లరేవు: తాళ్లరేవు కేశవపురం గ్రామంలో కొలువైన శ్రీదేవీ, భూదేవి సమేత కేశవస్వామివారి కల్యాణోత్సవాలకు సంబంధించి సోమవారం పందిరిరాట ముహూర్తం చేశారు. ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవ పోస్టర్‌లను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ స్వామివారి కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 1న స్వామివారి కల్యాణం, 2న కొతాయి ఉత్సవం, 3న సదస్యం, 4న గ్రామసేవ, 5న చక్రస్నానం, తెప్పోత్సవం, 6న శ్రీపుష్పోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం


క్రాంతికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దృశ్యం

రాజోలు: అనారోగ్యానికి గురైన దివ్యాంగ బాలుడు తెన్నేటి క్రాంతి వైద్యం కోసం సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. రాజోలు తెన్నేటి నగర్‌కు చెందిన క్రాంతికి బెస్సీస్ లిటిల్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆర్థిక సాయాన్ని సమకూర్చి అందించింది. సర్పంచ్ రేవు జ్యోతి, అడిషనల్ ఎస్సై కె.ప్రసాద్, పమ్మి రత్నకుమారి, తాడి సహదేవ్, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంత్యుత్సవాలు

అయినవిల్లి: స్థానిక చినపేటలో అంబేడ్కర్ జయంత్యుత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీ బయ్యా చినబాబు తదితరులు హాజరైయ్యారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎస్ఈబీ వాహనాల వేలం

ఆలమూరు: మద్యం అక్రమ రవాణాలో పట్టుకున్న వాహనాలకు ఈనెల 26న వేలం వేయనున్నట్లు ఆలమూరు ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.అరుణమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆసక్తి కలిగిన, అర్హులైన కక్షిదారులు ఎస్ఈబీ నిర్దేశించిన రూ.రెండు వేల ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు స్థానిక సిద్ధార్థ హైస్కూల్ సమీపంలో ఉన్న ఎస్ఈబీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

మలికిపురం: స్థానిక శ్రీవాణి గ్లోబెల్ స్కూల్‌లో సోమవారం పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఐ.పావని మాట్లాడుతూ విద్యార్థులలో వైజ్ఞానిక ప్రతిభను వెలికి తీయడానికి సైన్స్ ఎగ్జిబిషన్ దోహదపడుతుంది అన్నారు. కాగా ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు సమకూర్చిన డబ్బులతో ఆక్సిజన్ సిలెండర్‌ని కొనుగోలు చేసి, వృద్ధాశ్రమానికి బహూకరించనున్నట్టు పావని తెలిపారు.